

రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కాంగ్రెస్ విమర్శలు మానుకుని
అభివృద్ధికి కలిసి రావాలి

- మూడు నెలల్లో కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి టెండర్లు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

ముకరంపుర, మే 18: రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని విమర్శించడం మానుకుని అభివృద్ధికి సహకరిస్తూ కలిసి రావాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. అమృత్ భారత్ పథకం కింద కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి, ఆధునీకరణ పనులను ఆదివారం సాయంత్రం పరిశీలించారు. స్టేషన్‌లో ఇప్పటి వరకు చేపట్టిన పనుల గురించి మంత్రికి రైల్వే శాఖ అధికారులు వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఇప్పటి వరకు ఎన్ని నిధులు కేటాయించాం...? ఏ విధమైన అభివృద్ధి జరిగిందనే అంశంపై శ్వేత పత్రం విడుదల చేసేందుకు సిద్ధమన్నారు. కరీంనగర్-జగిత్యాల రహదారి టెండర్లు మూడు నెలల్లో పూర్తవుతాయని, ఈ విషయమై కేంద్ర మంత్రి గడ్కరీతోనూ మాట్లాడినట్లు చెప్పారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ కోసం రూ.33.30 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆధునీకరణలో భాగంగా స్టేషన్‌లో రెండు ప్లాట్ ఫాంలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఏసీ వెయిటింగ్ హాళ్లు, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్ల ఏర్పాటయ్యాయన్నారు. ఈ నెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 102 రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో మూడు రైల్వే స్టేషన్లు బేగంపేట, వరంగల్, కరీంనగర్ ఉన్నాయని తెలిపారు. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా ఆధునీకరించనున్నట్లు తెలిపారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులు కూడా కొనసాగుతున్నాయని, బడ్జెట్ కంటే అదనంగా రూ.2కోట్లు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉప్పల్ ఆర్వోబీ పనుల జాప్యంపై కాంట్రాక్టర్, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ నాటికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా వన్ లైన్ పనులను పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. హైదరాబాద్ గుల్జార్ హౌస్ ప్రమాద ఘటనలో 17 మంది మృతి చెందడం బాధాకరమని, తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. బీజేపీ పక్షాన సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వెంట రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హుజూరాబాద్ టౌన్, మే 18: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం సాధారణ ఎన్నికలను తలపించేలా రసవత్తరంగా జరిగాయి. అధ్యక్షుడిగా కొమురవెల్లి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మండల యాదగిరి, కోశాధికారిగా చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికవగా, మిగతా కార్యవర్గాన్ని ఆదివారం ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నట్లు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల కమిటీ తెలిపింది. ప్రధాన కార్యదర్శిగా ఎంఏ మతిన్, మక్కపల్లి రమేశ్ పై 21ఓట్ల మెజార్టీతో గెలుపొందారని, సంయుక్త కార్యదర్శిగా కోట సంపత్, కుడికాల ప్రభాకర్ పై 16 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు వెల్లడించింది. కార్యవర్గ సభ్యులుగా నలుగురు పోటీ చేయగా వారిలో ముషం రాజేంద్రం, కందల రమేశ్, తేలుకుంట్ల వేణు విజయం సాధించారని తెలిపింది. ఎన్నికల ఫలితాల అనంతరం కార్యవర్గానికి ప్రమాణస్వీకరణ పత్రాలను ఎన్నికల కమిటీ అందజేసింది. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ అధికారులు ఇలాసాగరం వీరస్వామి, సాదుల రవీందర్ బాబు, వేల్పుల రత్నం, పలకల ఈశ్వర్ రెడ్డి, పరాంకుశం కిరణ్ కుమార్, ఎడ్ల విజయ్ కుమార్, బండ కిషన్, సొల్లు సారయ్య, కొలిపాక సారయ్య బండ రాజిరెడ్డి, కొండ సత్యం , టీ రమేశ్, భారత ప్రభాకర్, భిక్షపతి, సమ్మయ్య, రాజ్ కుమార్, రాజేశం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సార్లూ.. ఇటు చూడరూ!

కొండపల్కలలో ఇటీవల ఈదురు గాలులకు పడిపోయిన కరెంట్ స్తంభం, వేలాడుతున్న విద్యుత్ వైర్లను చూపుతున్న రైతు

మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో ఈ నెల 4న ఈదురు గాలులకు పొలాల్లోని కరెంటు స్తంభాలు నేలకూలాయి. కరెంటు వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీనిపై చెంజర్ల సబ్ స్టేషన్ పరిధిలోని అధికారులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాల దగ్గరకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి, స్తంభాలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

-మానకొండూర్ రూరల్, మే 18

వేములవాడ రోడ్డు పక్కన నివాసాల సమీపంలో పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యంపై పట్టింపేది?

గంగాధర, మే 18 : మండలంలోని మధురానగర్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నెలల తరబడిగా వీధుల్లో చెత్త పోరుకుపోయి దుర్వాసన వస్తున్నది. గ్రామస్తులు చెత్తను వేయడానికి వీలుగా గ్రామంలోని వీధుల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ఇండ్లల్లో సేకరించిన చెత్తను గ్రామస్తులు సదరు కుండీల్లో వేస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది నెలల తరబడి కేవలం చౌరస్తాలో ఉన్న వ్యాపారుల దుకాణాల నుంచి మాత్రమే చెత్తను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీ వాహనం చౌరస్తాకే పరిమితమైందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చౌరస్తాలో ఉన్న దుకాణాలు మాత్రమే గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయా ? మా ఇండ్లు గ్రామంలో లేవా? అంటూ గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. కనీసం వారానికి ఒకరోజైనా వీధుల్లో చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మేరు సంఘం నాయకుల ఔదార్యం

తెలంగాణచౌక్, మే 18: జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ కుమార్ ఆధ్వర్యంలో కులస్తుడు వెంకటేశ్ కూతురు వివాహానికి 50 కేజీల బియ్యం బస్తాను ఆదివారం సంఘం కార్యాలయంలో అందజేసి ఔదార్యాన్ని చాటారు. సంఘ నాయకులు కిషన్, రాజు, లక్ష్మీనారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం.. తీస్తున్నది ప్రాణం

- కల్లాలు, సౌకర్యాలు కల్పించని అధికారులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- వారం వ్యవధిలో ఇద్దరు మృతి

ఎండనక, వాననక కష్టపడి ధాన్యం పండించిన రైతులకు వడ్లు పోసుకునేందుకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమవుతున్నారు. వెరసి చేసేదేం లేక రైతులు రోడ్లపై ఒక పక్క మొత్తం వడ్ల కుప్పలు పోస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వడ్ల రాశుల వద్ద వాహనాలు అదుపుతప్పి నిత్యం ఎంతో మంది గాయాలపాలవుతుండగా, వారంలోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

తిమ్మాపూర్ మండలం పోలంపల్లి శివారులో ఇటీవల రోడ్డుపై సగానికిపైగా ఆరబోసిన వడ్లు

తిమ్మాపూర్, మే 18: జిల్లాలోని చాలా గ్రామాల్లో స్థలం ఉన్న చోట కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నప్పటికీ, ప్రధానంగా డబుల్ రోడ్డు, సింగిల్ రోడ్డు ఉన్న గ్రామాల్లో అధికారులు, నిర్వాహకులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం లేదు. దీంతో రైతులు చేసేదేం లేక రోడ్లపై ఒక పక్క ఆక్రమించి వడ్లను ఆరబోస్తున్నారు. పలుచోట్ల సీడ్‌వడ్లు సైతం ఆరబోసి ఉంచుతున్నారు. ఒక్కో చోట సగానికిపైగా రోడ్డును ఆక్రమించేస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో వడ్ల రాశులు కనిపించక.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, అదుపుతప్పి వాహనాలు వడ్ల రాశులపై దూసుకెళ్లడంతో కిందపడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక స్వల్పగాయాలతో తేరుకొని వెళ్లిపోతున్న ప్రయాణికులు ఎంతోమంది ఉన్నారు.

బాధ్యత లేని అధికారులు..

ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారంటే.. కేంద్రానికి కొంత స్థలాన్ని ఏర్పాటు చేసి అక్కడ రైతులకు అన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉన్నది. కానీ రైతులు వడ్లు పండించారా.. తాము కొన్నామా లేదా అన్నచందంగా తయారైంది అధికారుల తీరు. కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఎక్కడబడితే అక్కడ వడ్లను కుప్పలుగా పోస్తున్నారు. పోసిన కుప్పలపై పరాదాలు కప్పడంతో రోడ్డుపై రాశులు ఉన్నట్లు కనిపించడం లేదు. అలాగే వాటి పక్కడ బండరాళ్లు పెడుతుండడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి.

వారంలోనే ఇద్దరు మృతి

ఈ యాసంగి పంట కొనుగోళ్లు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. ఈ నెల 10న వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి మణెమ్మ, సమ్మిరెడ్డి భార్యాభర్తలు రోజంతా కరీంనగర్‌లో పని చూసుకుని రాత్రి సమయంలో ఇంటికి వెళ్తూ.. మామిడాలపల్లి-పచ్చునూర్ గ్రామాల మధ్య రోడ్డుపై పోసిన వడ్ల కుప్పలు కనిపించక ప్రమాదానికి గురయ్యారు. వారి బైక్ అదుపుతప్పి పడిపోవడంతో మణెమ్మ, సమ్మిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. సమ్మిరెడ్డి కోలుకున్నప్పటికీ.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మణెమ్మ నాలుగు రోజులకు మరణించింది. అలాగే కరీంనగర్ రూరల్ మండలం ముగ్ధంపూర్‌కు చెందిన నేరెళ్ల రంజిత్‌కిరణ్ తన స్నేహితుడితో కలిసి తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామంలో పని చూసుకుని శనివారం రాత్రి కరీంనగర్ వైపు వెళ్తుండగా, మల్లాపూర్ శివారులో రోడ్డుపై పోసిన వడ్లరాశి పైకి బైక్ ఎక్కడంతో ఇద్దరూ కిందపడిపోయి గాయపడ్డారు. తలకు తీవ్రగాయమైన రంజిత్ అక్కడికక్కడే చనిపోయాడు.

మిన్నకుండిపోతున్న క్షతగాత్రులు

వడ్ల రాశుల బాధితులు ఎంతోమంది ఉంటున్నారు. కానీ చాలామంది స్వల్పంగా గాయపడ్డవారు వెళ్లిపోతున్నారు. ఇటు రైతులను నిందించలేక.. అధికారులను ప్రశ్నించలేక మిన్నకుండిపోతున్నారు. కేవలం పెద్దస్థాయిలో జరిగిన ప్రమాదాలు మాత్రమే ఇలా బయటికి తెలుస్తున్నాయి. ఇకనుంచైనా అధికారులు తీరు మార్చుకుని రైతులకు కల్లాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్లపై ఆరబోస్తే చర్యలు

రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయకూడదు. మా సర్కిల్ పరిధిలోని తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి మండలాల్లో ఎక్కడ కూడా రోడ్డుపై వడ్లు ఉండకూడదని ఆదేశించిన. తెలిసీతెలియక పోసినా వెంటనే తీసేయాలని సూచించాం. చిన్నపాటి నిర్లక్ష్యంతో ప్రాణాలు పోతున్నాయి. రోడ్లపై వడ్లుపోసి ప్రమాదాలకు కారణమైతే చర్యలు తీసుకుంటాం. రైతులకు అవగాహన కోసం అన్ని గ్రామాల్లో చాటింపు వేయించాం.

-సదన్‌కుమార్, సీఐ, తిమ్మాపూర్

వడ్ల కుప్పను ఢీకొని యువకుడి మృతి

రంజిత్‌కిరణ్(ఫైల్)

తిమ్మాపూర్, మే 18: రోడ్డుపై పోసిన వడ్ల కుప్పను ప్రమాదవశాత్తు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం ముగ్ధంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రంజిత్‌కిరణ్(32) తన స్నేహితుడు సాజిద్‌తో మండలంలోని మల్లాపూర్ గ్రామంలో స్నేహితుడిని కలిసేందుకు శనివారం సాయంత్రం బైక్‌పై వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి సమయంలో కరీంనగర్‌కు తిరిగి వస్తుండగా, మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడి సతీశ్ అనే రైతు రోడ్డుపై పోసిన ధాన్యం కనిపించక అదుపుతప్పి వడ్ల కుప్పను ఢీకొన్నాడు. దీంతో బైక్ కిందపడడంతో రంజిత్‌కిరణ్ తలకు తీవ్రగాయాలపై అక్కడికక్కడే మృతి చెందాడు. సాజిద్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ దవాఖాన మార్చురీకి తరలించారు. రంజిత్ భార్య రితిక ఫిర్యాదు మేరకు రైతు మామిడి సతీశ్‌పై ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. అలాగే ఘటనా స్థలాన్ని సీఐ సదన్‌కుమార్ పరిశీలించారు. రైతులు రోడ్డుపై ధాన్యం పోయవద్దని సూచించారు.

వల్భాపూర్‌లో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

వీణవంక, మే 18: వల్భాపూర్ గ్రామం వద్ద రోడ్డుపై ఆరబోసిన మక్క కంకుల కుప్ప వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పరకాలకు చెందిన కంచె కిరణ్-పావని దంపతులు వారి కుమారుడితో కలిసి ఆదివారం సాయంత్రం మండలంలోని కోర్కళ్ గ్రామంలో గల బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. అదే దారిలో వల్భాపూర్ వద్ద రోడ్డుపై ఆరబోసిన మక్క కంకుల కుప్ప ప్రమాదవశాత్తూ వాహనానికి తగిలి కిందపడిపోయారు. దంపతులకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో జమ్మికుంటలోని ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించినట్లు పేర్కొన్నారు. వారి కొడుకు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు.

23న పురుషుల పొదుపు సంఘం వార్షిక మహాసభ

హౌసింగ్‌బోర్డుకాలనీ, మే 18: అల్గునూర్ శ్రీ ఆంజనేయ పురుషుల పొదుపు సహకార సంఘం 14వ వార్షిక మహాసభ ఈ నెల 23న ఉదయం 11 గంటలకు స్థానిక వరంగల్ రోడ్డులోని సంఘ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సిరిసిల్ల అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులందరూ సకాలంలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

తెలంగాణచౌక్, మే 18: సమసమాజ నిర్మాణం కోసం జీవితాన్ని త్యాగం చేసిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సందర్భంగా ఈనెల 19 నుంచి వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి తెలిపారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్ర భవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సభలు సమావేశాలతో సుందరయ్య జీవిత చరిత్రను ప్రజలకు వివరించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేరుగా యుద్ధం చేయలేకనే ఉగ్రదాడులు

తెలంగాణచౌక్, మే18: భారత్‌తో నేరుగా యుద్ధం చేయలేకనే పాకిస్థాన్ ఉగ్రదాడులకు పాల్పడుతున్నదని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ స్పష్టం చేశారు. నగరంలోని కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పాకిస్థాన్ భారత్ మీద దాడుల కోసం కశ్మీర్ యువతకు తీవ్రవాద శిక్షణ ఇచ్చి ఉగ్రదాడుల చేయాలని కుట్రలు చేస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ యుద్ధం వచ్చే ఆస్కారం ఉందన్నారు. దేశంలోని అన్ని పార్టీలు పాకిస్థాన్ వైఖరిపై ప్రజలను చైతన్యపరచాలని కోరారు. సమావేశంలో ఫ్రంట్ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి విస్తృత పర్యటన

బద్దిపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తదితరులు

హౌసింగ్‌బోర్డుకాలనీ/కరీంనగర్ రూరల్, మే 18: మాజీ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ ఆదివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. మొదటగా గోదాం గడ్డలోని ముస్లిం స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సన్‌షైన్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం సాయినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్య పిల్లల హాస్పిటల్‌ను ప్రారంభించారు. అలాగే కొత్తపల్లి మండలం బదిపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన కల్యాణోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగులను ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే గోపాల్‌పూర్‌లో జీల్గుల మల్లికార్జునస్వామి పట్నాలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, దుర్గేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, సుడా మాజీ డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు మిడిదొడ్డి నవీన్, బద్దిపెల్లిగ్రామంలో జరిగిన కల్యాణ వేడుకల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానించాలి

కలెక్టరేట్, మే 18 : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి, రైతులు, ఉపాధి కూలీలకు ఉపయోగకరంగా మార్చాలని, జాతీయ వ్యవసాయ, ఉపాధి హామీ కూలీల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కడారి లక్ష్మీరాజం డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణులకు పని కల్పించే క్రమంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తే, నేటి పాలకులు ఉపాధి హామీ పనులు ఏటేటా కుంచిస్తూ కూలీల పొట్టగొడుతున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకు ఏటా కూలీ ధరలు పెంచాల్సి ఉండగా, నామ్‌కే వాస్తేగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకొంటున్నదని విమర్శించారు. ఉపాధి చట్టం ప్రకారం పనులు చేపట్టేందుకు అవసరమైన పనిముట్లు కూడా ప్రభుత్వమే అందించాల్సి ఉండగా, గత దశాబ్దకాలంగా మంగళం పాడిందన్నారు. వారానికోసారి కూలి డబ్బులు చెల్లించాల్సి ఉండగా, నెలల తరబడి పెండింగ్‌లో పెడుతూ కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని దుయ్యబట్టారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు వ్యవసాయ, ఉపాధి కూలీల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు ఇ.సహదేవ్, దుశ్యంతుల రాంనారాయణ, కడారి రామయ్యతో పాటు పలు మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సత్యనారాయణను పరామర్శిస్తున్న జయపాల్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుడి పరామర్శ

గంగాధర, మే 18 : మండలంలోని గోపాల్‌రావుపల్లి మాజీ సర్పంచ్ నాగారపు సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతుండగా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జయపాల్‌రెడ్డి మిత్ర మండలి సభ్యుడు పొన్నం పరశురాములు తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

సైదాపూర్, మే 18 : మండలంలోని రాయికల్ గ్రామంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన రావుల తిరుపతిరెడ్డి(38) గ్రామంలోనే తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా, కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. పంట పెట్టుబడి, ఇతర అవసరాల కోసం సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. కాగా, శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత భార్య, ఇద్దరు పిల్లలు ఆరుబయట నిద్రించగా, తిరుపతిరెడ్డి ఇంట్లో కూలర్‌వేసుకుని పడుకున్నాడు. ఉదయం భార్య తలుపు కొట్టినా తీయకపోవడంతో బలంగా నెట్టడంతో తెరుచుకున్నాయి. కాగా, అప్పటికే తిరుపతిరెడ్డి ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తిరుపతిరెడ్డి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

విద్యానగర్, మే 18: అంతర్జాతీయ ఎయిడ్స్ మెమోరియల్ క్యాండిల్ లైట్ డే సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ జెండా ఊపి ప్రారంభించగా, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సిబ్బంది, ఎన్జీవో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన

గంగాధర, మే 18 : మండలంలోని కురిక్యాలలో ఆదివారం చక్రిక వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో రెనాటల్ వెల్‌నెస్ ఆర్గానిక్ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు నల్లాల రాజేందర్ మాట్లాడుతూ, రైతులు విచక్షణ రహితంగా రసాయన ఎరువులు వాడడం వల్ల ప్రకృతికి హాని కలుగుతుందన్నారు. సేంద్రియ సాగువల్ల భూమి సారవంతంగా మారడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

హుజూరాబాద్ టౌన్, మే 18: పట్టణానికి చెందిన చౌడమల్ల కృష్ణకుమారి స్మారకార్థం భర్త సారయ్య, కుమారుడు భానుకిరణ్ పదివేల రూపాయల విలువగల క్రీడా కిట్లు, హాకీ స్టిక్కులను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారులకు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్ర ప్రసాద్, సెక్రటరీ తిరుపతి గౌడ్, సామాజిక కార్యకర్త రవీందర్‌రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళి

కరీంనగర్ రూరల్, మే 18: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారితోపాటు ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన వీర జవాన్లకు ఆదివారం బొమ్మకల్‌లోని హిందూ వాహిని జెండా వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పటేల్ మిత్ర సంఘం సభ్యులు, మాజీ సైనికులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



మానకొండూర్: గురువులతో పూర్వ విద్యార్థులు

మానకొండూర్, మే 18: మండల కేంద్రంలోని చాణక్య ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆటపాటలతో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఆడెపు రవీందర్, శకుంతలాదేవి, పద్మారెడ్డి, వైద శ్రీధర్ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జువ్వాజి శ్యాంసుందర్, కోల మహేందర్, గడ్డం వేణుగోపాల్, గడ్డం సతీ